కప్పేసిన మంచు దుప్పటి

ప్రజాశక్తి- గోపాలపురం

గోపాలపురాన్ని మంచు దుప్పటి కప్పేస్తుంది. దట్టమైన పొగ మంచుతో రహదారులు మూసుకు పోయాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హైవే, రోడ్లపై వెళుతున్న వాహన చోదకులు వాహనాలు కనబడక ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వేసుకుని వెళ్తున్నారు. మంచు కారణంగా ముందు కనుచూపు మేరలో ఏముందో కనిపించిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

కప్పేసిన పొగ మంచు

నేడు 'ఓట్ ఫర్ ఒపిఎస్'

రాజమహేంద్రవరంలో పెన్షన్ సాధన సభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ సాధన కోసం అన్ని రాజకీయ పక్షాలతో ఆదివారం రాజమహేంద్రవరంలో 'ఓట్ ఫర్ ఒపిఎస్' పేర సభను నిర్వహించనున్నారు. ఇప్పటికే సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని ఎస్‌కెవిటి కళాశాల ఆవరణలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ సభ జరుగనుంది. ఈ సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెఎస్ఎస్.ప్రసాద్, ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ సభకు అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించారు. ఎవరైతే పాత పెన్షన్(ఒపిఎస్)ను ఇస్తామని చెప్పి, తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చుతారో ఆ పార్టీకే తమ మద్దతు ఉంటుందని చెబుతున్నారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని విస్మరించారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలుపోరాటాలు జరిగాయి. అయినప్పటికీ ప్రభుత్వంలో స్పందన లేకపోగా జిపిఎస్ అంటూ కొత్త పాట అందుకున్నారు. ఇది సిపిఎస్ కంటే ప్రమాదకరమైందని, ఇది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎంత మాత్రం శ్రేయస్కరం కాదని గ్రహించారు. దీంతో జిపిఎస్ రద్దు కోసం కూడా పలు పోరాటాలను నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాలతో పాటూ ఉద్యోగ సంఘాలు దీనికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో భాగస్వాములయ్యాయి. సమస్యను పరిష్కరించకపోగా ప్రభుత్వం ఉద్యమాలను అణచివేసేందుకు కుయుక్తులు పన్నింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై కక్షపూరిత చర్యలకు సైతం పాల్పడింది. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని సుప్రీంకోర్టు చెప్పినా వైసిపి సర్కారు ఏకపక్షంగా వ్యవహరించింది. ఇచ్చిన హామీని అమలు చేయకుండా పోరాటాలను ఉక్కుపాదంతో అణచివేయటంతో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో పాటూ వామపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో మరో పోరాటానికి వారు సిద్ధమయ్యారు. అందులో భాగంగా రాజమహేంద్రవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటూ అన్ని రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహణకు నడుంబిగించింది. ఈ సభలో ఒపిఎస్ సాధన కోసం భవిష్యత్ కార్యాచరణను ప్రకటించేందుకు సిద్ధమైంది. సభను జయప్రదం చేయాలని ఇప్పటికే రాష్ట్ర స్థాయి నాయకత్వంతో పాటూ మండల స్థాయి వరకూ ప్రచారం జరిగింది. పోస్టర్లను సైతం పలుచోట్ల ఆవిష్కరించారు. రానున్న పోరాటాలకు ఓట్ ఫర్ ఒపిఎస్ సభ బీజం పోయనుంది. ఇప్పటికే సభకు అన్ని ఏర్పాటు చేశామని శనివారం యుటిఎఫ్ నాయకత్వం మీడియా ముఖంగా తెలిపింది. ఈ సభలో వేలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొంటారని పేర్కొంది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ సాధన సభ జయప్రదానికి పిలుపు

చాగల్లు : రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం జరిగే ఒపిఎస్ సాధన సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పట్టా రవివర్మ పిలుపునిచ్చారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. డిమాండ్లను అన్ని రాజకీయ పార్టీల ముందుంచి, స్పష్టమైన హామీలతో బాటు వారి మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎవరైతే స్పష్టమైన హామీ ఇస్తారో వారికే మద్దతు ఇస్తామన్నారు. ఈ సభకు అత్యధిక మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహా అధ్యక్షులు టి.సత్తిరాజు, ప్రధాన కార్యదర్శి పట్టా రవివర్మ, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి, గంగాధర్, ఆదిబాబు, తన్వీర్, రమేష్‌బాబు, హరిప్రియ, గాయత్రిదేవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

చట్టం ప్రకారం నడుచుకోవాలి

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రతి ఒక్కరూ చట్టం ప్రకారం నడుచుకోవాలని మత్స్యకారులకు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. బొబ్బర్లంక, ధవళేశ్వరం మత్స్యకారుల మధ్య ఏర్పడిన వివాదం నేపథ్యంలో మంత్రి వేణు, కలెక్టర్, ఎస్‌పిల సమక్షంలో ఇరుపక్షాలతో శనివారం చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడారు. జీవనోపాధి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. చట్ట పరిధిలో భద్రత కల్పించే విధంగా బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది సమస్య పరిష్కారానికి అత్యంత అవసరం అని పేర్కొన్నారు. సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే అధికారులను సమావేశ పరిచి పరిష్కరించాల్సిందిగా ఆదేశించామని తెలిపారు. అందులో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. వాస్తవ దక్పథం తో, చట్టాన్ని గౌరవిస్తూ అక్రమ చొరబాట్లకు తావు లేకుండా సామరస్యంగా పరిష్కరించు కోవాల న్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం లీజు కోసం దరఖాస్తు చేసు కోవాలని బొబ్బర్లంక మత్స్యకారసంఘాల ప్రతినిధులకు స్పష్టం చేశారు. చట్టబద్ధమైన లీజుదారులకు అవసరమైన రక్షణ కల్పిస్తామన్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. బొబ్బర్లంకకు చెందిన ఎస్‌సి మత్స్యకారులు అక్రమంగా చొరబడి ధవళేశ్వరం ఎఫ్‌సిఎస్ సభ్యుల కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని ఇమ్మానుయేల్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బొబ్బర్లంకకు చెందిన ఎస్‌సి మత్స్యకారుల ప్రతినిధి పార్ల కాలేపు మాట్లాడుతూ దశాబ్దల కాలంగా బ్యారేజ్ పరిధిలో వలస వచ్చి జీవనోపాధి చేసుకుంటున్నామని తెలిపారు. ధవళేశ్వరం ఎఫ్‌సిఎస్ లీజుదారుల కార్యకలాపాలతో అక్రమ చొరబాటుదారుల నుంచి హక్కులను కాపాడేందుకు చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్‌పి పి.జగదీష్, జెసి ఎన్.తేజ్‌భరత్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా జెసి శ్రీవాస్‌నూపుర్‌అజయ్, అదనపు ఎస్‌పి ఖాదర్ ఖాన్, జిల్లా మత్స్య అధికారి వి.కృష్ణారావు, కోనసీమ జిల్లా డిఎఫ్ఒ ఎన్.శ్రీనివాస రావు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేనకు మద్దతు ఇచ్చేది లేదు

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో జనసేన పార్టీ పోటీ చేస్తుందన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని టిడిపి నాయకులు స్పష్టం చేశారు. జనసేన అధినేత తొందరపాటు నిర్ణయం వల్ల టిడిపికి నష్టం వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చంనాయుడుకు తెల్చి చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళగిరిలో రాష్ట్ర అధ్యక్షునితో నియోజకవర్గం టిడిపి నాయకులు కోరుకొండ మాజీ జడ్‌పిటిసి సభ్యులు వెంకటరత్నం అప్పలనరసారావు, మాజీ ఎంపిపి నూకరత్నం, మండలం అధ్యక్షుడు గండి విజయకుమార్, ఎం.అప్పా రావు తదితరులు శనివారం వినతిపత్రం అందించారు. ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి నాయకత్వంలో నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉందని, ఈ పరిస్థితుల్లో టిక్కెట్‌ను జనసేనకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో జనసేనకు గెలిచే సత్తా లేదని ఇటువంటి తొందరపాటు నిర్ణయం వలన టిడిపి నాయకత్వం దెబ్బతింటుందని చెప్పారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమా జనసేన పార్టీ మద్దతుగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. జనసేన గెలుపునకు సహకరించేది లేదని తెగేసి చెప్పారు. 29న నియోజకవర్గంలో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సభకు రావడం లేదన్నారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు అచ్చంనాయుడు మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో టిడిపి నాయకత్వం అధైర్య పడొద్దన్నారు. రెండు పార్టీల అధినేతలు కలిసి నియోజకవర్గంలో అభ్యర్థుల వివరాలు ప్రకటించాల్సి ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయం ప్రకటించలేదని చంద్రబాబు సభను విజయవంతం చేయాలని మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్‌ను కోరారు.



మొక్కల రవాణాకు సహకరించండి

ప్రజాశక్తి - కడియం

సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పరిధిలోని నర్సరీల నుంచి దేశ, విదేశాలకు మొక్కలు రవాణా చేసేందుకు సహకరించాలని కడియం సిఐను అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. నూతనంగా భాద్యతలు చేపట్టిన సిఐ బి.తులసీధర్‌ను అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సిఐ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సిఐ సానుకూలంగా స్పందించారని అధ్యక్షులు మల్లు పోలరాజు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి గాధ నాగేశ్వరరావు, గట్టా కృష్ణ భగవాన్, జంగా సుబ్బారావు, గాజుల రత్తయ్య తదితరులు సిఐను కలిసిన వారిలో వున్నారు.

సిఐకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు

వైసిపి బిసి సెల్ జిల్లా సెక్రటరీగా శ్రీనివాస్

ప్రజాశక్తి- కడియం

మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన టేకి శ్రీనివాసరావు వైసిపి బిసి సెల్ జిల్లా సెక్రటరీగా నియమితులయ్యారు. న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన శ్రీనివాసరావు వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. గతంలో దుళ్ల ఎంపిటిసిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సభ్యులు కట్టుంగ నాగరాజు, పలువురు నాయకులు, పెద్దలు ఆయనకు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న శేషారావు

'రా..కదలిరా' సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాతేరులో సోమవారం నిర్వహించనున్న రా..కదలి రా... బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పిలుపునిచ్చారు. వేలువెన్నులో టిడిపి, జెఎస్‌పి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డారు. ఈ సభకు టిడిపి అధినేత చంద్రబాబు హాజరవుతారన్నారు. భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లి, సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి, టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వర రావు, ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా టిడిపి మాజీ అధ్యక్షులు మెంటే పార్థ సారథి, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు వీరమళ్ల బాలాజీ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'యువగళం' వేడుకలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టిడిపి అధినేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని శ్యామలానగర్ రామాలయం సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, 108 కొబ్బరి కాయలు కొట్టి వేడకలు నిర్వహించారు. నక్కా సంతోష్ సమకూర్చిన మూడు త్రై సైకిళ్లను వికలాంగులకు అందించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడారు. చంద్రబాబు మాదిరిగానే లోకేష్ కూడా మంచి విజన్ ఉన్న నాయకుడన్నారు. తమ భవిష్యత్తు నాయకుడు లోకేష్ అని అన్నారు. యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. నక్కా దేవీవరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా లోకేష్ తన పాదయాత్రను పూర్తి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, తాడేపల్లి గూడెం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, టిఎన్‌టియుసి జిల్లా మాజీ అధ్యక్షులు నక్కా చిట్టిబాబు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, టీడీపీ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్‌నాయుడు

చివటంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కుల మతాలు, పార్టీ తారతమ్యాలు చూడకుండా ప్రతి ఒక్కరికి అందిస్తున్నామన్నారు. పథకాలను అందుకున్న వారు తప్పనిసరిగా రానున్న ఎన్నికలలో తమకు ఓటేసి గెలిపిస్తారన్నారు. మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి పీఠాన్ని అధిరోహిస్తారన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, పాలాటి శరత్, చివటం పిఎసిఎస్ అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, కె.వీరాస్వామి, గుత్తికొండ శ్రీనివాసు, జి.పుల్లయ్య, వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

రానున్న ఎన్నికల్లో నాయకులు ప్రజలు వైసిపికి ఓటు వేసి తనను గెలిపించడం ద్వారా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు కోరారు. నియోజకవర్గ పరిశీలకులు రాజీవ్‌కృష్ణ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ తలారి శనివారం తాళ్లపూడి మండలంలోని తాడిపూడి, ప్రక్కిలంక గ్రామాల్లో జరిగిన పరిచయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, తాడిపూడి సర్పంచ్ నామ గోపాలం, వైసిపి ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు యాళ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

ఉపాధ్యాయుల కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభోత్సవ సభలో ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్రంలో విద్యా రంగానికి అత్యధిక నిధులు కేటాయించి గణనీయమైన మార్పులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శనివారం నగరంలోని కోట గుమ్మం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన డిఇఎస్ కార్యాలయం 3వ అంతస్తులో నిర్మించిన ఉపాధ్యాయుల కాన్ఫరెన్స్ హాల్‌ను ఎంపీ భరత్ ప్రారంభించారు. ఈ భవనాన్ని గెయిల్ సంస్థ సమకూర్చిన రూ.15 లక్షలతో నిర్మించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లా డారు. మాతృభాషతో పాటూ విద్యార్థులకు ఆంగ్లంపైనా పట్టు అవసరమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా ఆంగ్ల భాషా బోధనను తీసుకొచ్చారన్నారు. 'నాడు-నేడు' ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చేశా రన్నారు. నగర అభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నానని తెలిపారు. ప్రజల మద్దతుతో ఎంఎల్ఏగా గెలిపించాలన్నారు. 2027 పుష్కరాల సమయానికి రాజమండ్రి నగరాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. తాను ఎంఎల్ఎ అయితే 24 గంటలూ తాగునీరు సరఫరా అయ్యేలు చర్యలు చేపడతానని చెప్పారు. మార్చి 10 నాటికి మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ప్రారంభానికి నోచుకోనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎస్.అబ్రహాం, ఎపిసిఎస్ సుభాషిణి, ఎంఇఒ గౌరీశంకర్, అర్బన్ డిఐ బి.దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పొత్తు సమయంలో మిత్ర ధర్మం ఏమైందో?

జనసేన అధినేత పవన్‌పై ఎంపీ భరత్ సెటైర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మిత్ర ధర్మం గురించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతుంటే రాష్ట్రంలోని ప్రజలు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకుంటున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఎద్దేవా చేశారు. శనివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధినేత పవన్ రెండు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి, టిడిపి మిత్ర ధర్మం పాటించలేదని..అందుకే తానూ రెండు స్థానాలు ప్రకటించాననడం చిన్న పిల్లల గిల్లికజ్జాలా ఉందన్నారు. టిడిపితో జనసేన పొత్తు పెట్టుకుంటోందని రాజమహేంద్రవరంలో బహిరంగంగా ప్రకటించినప్పుడు మిత్ర ధర్మం ఏమైందని ప్రశ్నించారు. ఒకవైపు బిజెపితో పొత్తుందని చెబుతూ, టిడిపితో పొత్తు ప్రకటించేటప్పుడు బిజెపికి చెప్పారా? అని ప్రశ్నించారు. ఇదేం మిత్ర ధర్మం అని ప్రశ్నించారు. అసలు పొత్తులపై స్పష్టత లేకుండా ప్రజలకు ఏం క్లారిటీ ఇస్తారన్నారు. భవిష్యత్తు సిఎం చంద్రబాబే అని లోకేష్ అన్నప్పుడు ఎందుకు ఖండించలేదన్నారు. జనసేన పవన్ ఒక పప్పెట్ మాత్రమేనా అన్నారు. ఒక తోలు బొమ్మలా పవన్‌ను ఆడిస్తున్నారన్నారు. ఇవన్నీ వారి రాజకీయ వ్యవహారాలని, వాటి గురించి పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆయన వెంట డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఉన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

కార్టూ'నిజం'

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే...

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఎలక్ట్రీషియన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల బైకు ర్యాలీలు నిర్వహించారు. ఎడిసన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులిర్పంచారు. **రాజమహేంద్రవరంలో** ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్లకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని, వారి సంక్షేమానికి సహకారం అందిసామని మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక త్రీ టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న సాయిరామ్ రజక కల్యాణ మండపంలో ది న్యూ రాజమండ్రి ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎలక్ట్రీషియన్ డే వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా థామస్ ఎడిసన్‌కు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సంక్షేమ నిధికి ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున రూ. 2.50 లక్షలను విరాళంగా అందించారు. వారు మాట్లాడుతూ అసోసియేషన్‌కు తమకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం తాము కషి చేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు, టిడిపి బిసి సెల్ నగర అధ్యక్షులు బుడ్డిగ రవిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ యాళ్ల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కె.గణేష్‌బాబు, సెక్రటరీ పి.మహేష్, జాయింట్ సెక్రెటరీ ఎం.పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ఎలక్ట్రీషియన్స్ సంఘం మండల అధ్యక్షులు ఎలుబోలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సొలస సత్యనారాయణ ధమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎలక్ట్రీషియన్ డేను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రీషియన్ కార్మికులు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చంద్రశేఖర్ దివ్య గ్రామాల ఎలక్ట్రీషియన్ కార్మికులు పాల్గొన్నారు. **పెరవలిలో** మండలం ప్రైవేట్ ఎలక్ట్రీషన్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ పెరవలి, ముక్కామల గ్రామాల్లో ఎలక్ట్రీషన్ డేను నిర్వహించారు. గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముక్కామల గ్రామపంచాయతీ పరిధిలో ఉమ్మడివారిపాలెం ఏటిగట్టు సమీపంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గీత ఎంటర్ ప్రైజస్ సహకారంతో భోజనం ఏర్పాట్లు చేశారు. అనంతరం యూనియన్ ప్రెసిడెంట్ పి.ధనరాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి.వెంకటేశ్వర్లు, ప్రయివేటు ఎలక్ట్రీషియన్లు, ప్లంబింగ్ వర్కర్స్, పాల్గొన్నారు. **గోకవరంలో** గోకవరం యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎలక్ట్రీషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.కార్తీక్ మాట్లాడారు. అనంతరం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. థామస్ అల్వా ఎడిసన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎంఎన్‌విఎస్.రాజు, పాలెపు నాగేశ్వరరావు, కంబాల బాబ్జి, గునుపల్లి శివ, ఎస్.సూర్యప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.దుర్గ, సెక్రటరీ వి.అర్జునుడు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో...

గోకవరంలో ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్ల ప్రదర్శన

నేరాలు ఘోరాలు

ఘటనా స్థలంలో దంపతుల మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రోళ్లపాలెం నేషనల్ హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. గారపాటి వెంకట్రావు, గారపాటి మంగతాయారు భార్యాభర్తలు. వారు శనివారం అమలాపురం వైపు నుంచి బోడసకుర్రు వైపునకు బైకుపై వెళ్తున్నారు. వారు రోళ్లపాలెం వద్దకు వచ్చే సరికి ఎదురుగా మినీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట్రావు(55), మంగతాయారు(50) అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని అమలాపురం పట్టణ ఎస్ఐ క్రిస్టోఫర్, రూరల్ ఎస్ఐ వీరబాబు, అల్లవరం ఎస్ఐ హరీష్ కుమార్ పరిశీలించారు. ఘటనకు కారణమైన వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారని డిఎస్‌పి అంబికా ప్రసాద్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ నుంచి తిరుమలకు వెళుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ జారిపడిన సంఘటనలో వ్యక్తి గాయాలపాలయ్యాడు. స్థానిక రైల్వేస్టేషన్లో శనివారం రైలు కదిలే సమయంలో ఎక్కుతూ ఒక్కసారిగా జారిపడి కిందపడిపోయాడు. దీంతో ఆ ప్రయాణికుడికి గాయాలయ్యాయి. దీంతో రైల్వే పోలీసులు ఆ క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాలపాలైన వ్యక్తి వివరాలు తెలియాల్సివుంది.

సారా కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు, బొర్రంపాలెం గ్రామాల శివారుల్లో ఉన్న సారా బట్టీలీపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా బట్టీ నిర్వాహకులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ లక్ష్మణరావు వెల్లడించారు. తాళ్లూరు గ్రామ శివారులో సారా బట్టీపై దాడి అయినవిల్లి సత్యనారాయణను అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే బొర్రంపాలెం గ్రామానికి చెందిన పిడిమి దుర్గా ప్రసాద్ తాళ్లూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామిని దర్శించుకునేందుకు నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కుని పరారయ్యారు. పిఠాపురం మండలం విరవ గ్రామానికి చెందిన మహిళ కాలినడకన తన గ్రామం నుంచి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి బయలుదేరి వస్తుండగా దివిలి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో బంగారు గొలుసు, పుస్తెల తాడు తెంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ మహిళ కేకలతో చుట్టుపక్కల వారు రావడంతో అప్పటికే తగిపోయిన బంగారు గొలుసు తీసుకుని పారిపోయారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా పోలీస్ స్టేషన్లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని తెలిపారు.

గోదావరి కాలువలోకి దూసుకెళ్లిన కారు

కారును ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ రోడ్‌లో రైల్వేగేటు సమీపంలో శనివారం సాయంత్రం ఆదిత్య కళాశాలకు చెందిన బస్సు కారును ఢీకొట్టింది. దీంతో కారు గోదావరి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలావున్నాయి..శనివారం సాయంత్రం పెద్దాపురంలో విధులు ముగించుకుని మారుతి కారులో ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాస్ కాకినాడ బయలుదేరారు. స్థానిక రైల్వే గేట్ దాటాక వెనక నుంచి ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు కుడివైపు ఉన్న గోదావరి కాలంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డిఇ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు కాలువలో పడిన కారును క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ రాకపోకలను క్రమ బద్ధికరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీకొన్న కారు

ప్రజాశక్తి - యానాం

దొమ్మేటి పేట సమీపంలో కొండమూరి భాస్కరరావు గార్డెన్ వద్ద అదుపుతప్పి ఒక కారు చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలావున్నాయి. యానాంకు చెందిన డిపర్తి నారాయణస్వామి, పూడి కిరణ్ ఇద్దరూ యానాం నుంచి పొలానికి వెళ్తుండగా శనివారం భాస్కరరావు గార్డెన్ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి రెండు పల్టీలు కొట్టింది. అయితే కారులో ఉన్న ఇద్దరు తేరుకుని బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే డీజిల్ ట్యాంకుకు రంధ్రం పడి కారులోంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఇద్దరికి స్వల్ప గాయాలపాలయ్యారు. కారుడ నుంచి బయటపడిన తరువాత ఒక వ్యక్తి స్పృహ కోల్పోవడంతో ఇద్దరిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు ధృవీకరించారు. ఈ ప్రమాదంపై ట్రాఫిక్ ఎస్ఐ వీరభద్రస్వామి కేసు నమోదు చేశారు.

స్ఫూర్తినీయం...అంగన్‌వాడీల పోరాటం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీ ఉద్యోగులు తమ ఉద్యమ పథంలో మరో మైలురాయిని దాటారు. అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చిన విషయం విధితమే. విజయవాడకు బయలు దేరిన అంగన్‌వాడీలను ప్రభుత్వం నిర్బంధానికి గురి చేసింది. జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌ల్లో అక్రమ అరెస్టులకు పాల్పడి సుమారు 12 గంటల పాటు నిర్బంధించింది. అక్కడితో ఆగకుండా టెర్మినేషన్ లెటర్లు తీసుకోవాలంటూ బెదిరింపులకు సైతం పాల్పడింది. అయినా అంగన్‌వాడీలు వెనక్కి తగ్గలేదు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామంటూ తేల్చి చెప్పి భవిష్యత్తు పోరాటలకు స్ఫూర్తిగా నిలిచారు. ఎట్టకేలకు ప్రభత్వమే దిగొచ్చి పలు డిమాండ్లను పరిష్కరించడంతో పాటు వేతనాల పెంపునకు గడువు కోరింది. నిర్దేశిత కాలంలోపు హామీలు అమలు చేయని పక్షంలో మరోసారి సమ్మె తప్పదంటూ అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఇది తాత్కాలిక విరామమే అంటూ తేల్చి చెప్పారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు యథావిధిగా విధుల్లో చేరి సేవలందిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు సిపిఎస్ రద్దు కోరుతూ మరో పోరాటానికి సిద్ధం అయ్యాయి. గతంలో నిర్వహించిన ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విధితమే. ఇప్పుడు మరో రాష్ట్ర వ్యాప్త పోరాటానికి సిద్ధపడ్డారు. దీనికి రాజమహేంద్రవరం వేదిక కానుంది. నేడు జరిగే సభలో భవిష్యత్తు కార్యచరణను ప్రకటించేందుకు అవి సమాయత్తం అయ్యాయి. ప్రభుత్వం పునరాలోచించుకుని పాత పెన్షన్ స్కీమును అమల్లోకి తీసుకురాకుంటే తీసుకోవాల్సిన కార్యాచరణకు నేడు బీజం పడనుంది.

టిడిపి, జనసేన కూటమిలో ముసలం

టిడిపి, జనసేన కూటమిలో ముసలం పుట్టింది. మూడు నెలల క్రితం ఇదే జిల్లాలో జనసేన అధినేత పవన్‌కళ్యాన్ పొత్తు ప్రకటించిన విషయం విధితమే. అయితే తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ పొత్తుకు జిల్లాలోనే తెరపడనుందా అనే సందేహాలు ఆ రెండుపార్టీల్లోనూ వ్యక్తమవుతున్నాయి. టిడిపి అధినేత చంద్రబాబు అరకు, మండపేట నియోజక వర్గాల నుంచి టిడిపి పోటీ అంటూ చేసిన ప్రకటనపై జనసేన అధినేత భగ్గుమన్నారు. తామేమి తక్కువ కాదంటూ రాజానగరం, రాజోలులో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. చంద్రబాబు పొత్తు ధర్మం పాటించలేదని ఘాటుగా విమర్శించారు. ఈ నేపథ్యంలో రాజానగరంలో తెలుగు తమ్ముళ్ల తిరుగుబావుటా ఎగురవేశారు. జనసేనకు సహకరించేది లేదని పత్రికా ముఖంగా తేల్చిచెప్పడంతో పాటు పార్టీ అధ్యక్షులకు వినతిపత్రం అందించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందని 2014 ఫలితాలు, 2024లో పునరావృతం కావడం ఖాయమని తేదేపా నేతల్లో ధీమా వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలతో పొత్తుపై నీలినీడలు కమ్మాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

'తూర్పు'పై స్పెషల్ ఫోకస్

టిడిపి నేతలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్పెషల్ ఫోకస్ పెట్టారని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. అధినేత చంద్రబాబు నాయుడు మండపేటలో నిర్వహించిన సభలో ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని కోరడంతో పాటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు ఎంపీ సీటు గెలవటం ఖాయమని జోస్యం చెప్పారు. అయారాం. ఇదే సందర్భంగా మండపేట ఎంఎల్ఏ వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలంటూ అభ్యర్థిని ఖరారు చేసినట్లు చెప్పకనే చెప్పారు. తూర్పులో తొలి సీటు ఖాయం అవడంతో వేగుళ్ల శిబిరంలో నూతనోత్సాహం నెలకొంది. ఇదే సభలో అధికార పార్టీ నేతలకు పేరు పేరునా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశమైంది. మరోవైపు చంద్రబాబు సతీమణి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 రోజుల పాటు పర్యటించి పార్టీ శ్రేణులతో మమేకం అయ్యారు. స్కిల్ స్కాం కేసులో చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో నిజం గెలవాలి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. మనోవేదనతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేదుకు మూడు జిల్లాల్లో పలు కుటుంబాలను కలిశారు. పార్టీ శ్రేణులతో మమేకమై జిల్లా తేదేపాలో ఉత్సాహన్ని నింపారని తెలుస్తోంది.

ఓటర్ల జాబితాపై వెల్లువెత్తిన విమర్శలు

జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేసిన ఓటర్ల జాబితా తప్పుల తడకలుగా మారటంతో ఓటర్లలో అసహనం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కార్యాలయానికి క్యూ కడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 16.50 ల క్షల ఓటర్లు ఉన్నారని అధికార యంత్రాంగం లెక్కతేల్చింది. ఆ మేరకు గత వారంలో జాబితాను విడుదల చేసింది. తాజా జాబితాలో తప్పులను వీలైనంత త్వరగా సరిచేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

మాజీ మంత్రి జవహర్‌పై నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో టిడిపి నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలు కలిగేలా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి కెఎస్.జవహర్ ప్రమేయం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ దిసభ్య కమిటీకి ఫిర్యాదు చేసినట్లు యువగళం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర తెలిపారు. శనివారం తాళ్లపూడిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జవహర్ అనుసరిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తున్న కొవ్వూరు తాళ్లపూడి చాగల్లు మండలాలకు చెందిన కొంతమంది టిడిపి నాయకులు శనివారం కొవ్వూరులో జరిగిన రా కదలిరా కార్యక్రమం విజయవంతం కోసం జరిగిన సమావేశంలో దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి కంటమణి రామకృష్ణలకు ఫిర్యాదు చేశారన్నారు. ఇటీవల జవహర్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఫ్లెక్సీల వివాదం జరిగిందని నాయకులు కార్యకర్తల మధ్య విభేదాలు రెచ్చగొట్టే విధంగా జవహర్ చర్యలు ఉంటున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో ఆయన ప్రమేయం లేకుండా పార్టీ పెద్దలు చొరవ తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ తేజస్వినికి డాక్టరేట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

డాక్టరేట్ పత్రాన్నిఅందిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్ర

రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు తేజస్విని డాక్టరేట్ డిగ్రీ పొందినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కె తెలిపారు. 'లోహ ఆక్సైడ్లు హరితనానో సంశ్లేషణ వాటిని జీవసంబంధ మరియు కాలుష్య నివారణకు ఉపయోగించడం' అనే అంశంపై డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో తేజస్విని పరిశోధన చేశారన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారన్నారు. ఈ సందర్భంగా కళాశాల బోర్డ్ ఆఫ్ రీసెర్చ్ స్టడీస్ సమన్వయ కర్త డాక్టర్ ఈసుబ్ భాషా రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, డాక్టర్ బి.మల్లికార్జున, జొన్నకుటి యాకోబ్ ఇతర అధ్యాపకులు పాల్గొని అభినందించారు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి సిఎం కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్రంలో మహిళలు ఆర్థిక పరిపుష్టి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం నగరంలోని 37, 38, 31, 32 వార్డులకు సంబంధించి స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా 4వ విడత నిధులకు సంబంధించి నమూనా చెక్‌ను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. మహిళలు స్వశక్తితో జీవించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకొచ్చాక దాదాపు సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరునే ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిఎం జగన్ చిత్ర పటానికి మహిలలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి, జెసిఎస్ ఇన్‌ఛార్జి కొత్త విజయరాజ్యలక్ష్మి, అరిగెల బాబు, ఇసుకపల్లి శ్రీను, ముప్పన శ్రీను, ముత్యాల వీర అప్పారావు , వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి- తాళ్లపూడి

ప్రజలందరికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అన్ని విధాలుగా గ్రామాల అభివృద్ధి వైసిపితోనే సాధ్యమైందని వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు అన్నారు. గ్రామంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న రెండు సచివాలయాలు, రెండు ఆర్‌బికె సొంత భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ హోం మంత్రి తానేటి వనిత సహకారంతో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు సాధించుకున్నామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కొమ్మిరెడ్డి వీరరాఘవమ్మ, రావిపాటి లక్ష్మణరావు, ఉపసర్పంచ్ మదన్, గ్రామ కార్యదర్శి డి.శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు నాగాంజనేయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తాళ్లపూడి ఎస్ఐ టి.శ్యాంసుందర్ స్పష్టం చేశారు. ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన రాజమహేంద్రవరం మూడో పట్టణ ఎస్ఐగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా తాళ్లపూడికి వచ్చారు. శనివారం సాయంత్రం వైసిపి కొవ్వూరు నియోజకవర్గం పరిశీలకులు, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావులను కలిశారు. ఇంత వరకు తాళ్లపూడి ఎస్ఐగా పనిచేసిన కెవి.రమణ విజయవాడ బదిలీపై వెళ్లారు.

డ్రెయిన్లను పరిశీలిస్తున్న మంత్రి వేణు

స్వచ్ఛత అందరి బాధ్యత : మంత్రి వేణు

ప్రజాశక్తి- కడియం

రాష్ట్ర ప్రభుత్వం పరిసరాలు పరిశుభ్రతకు పెద్దపేట వేస్తోందని, స్వచ్ఛత అందరి బాధ్యత అని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వైసిపి రాజమహేంద్రరం కో-ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండలం వేమమగిరి తోటలో స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అన్నారు. తూర్పు డెల్టా ప్రధానకాలువను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు. ఇంటింటికీ వెళ్లి పలు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

ఏకపాత్రాభినయంలో లీలసంతోషికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - గోపాలపురం

జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం రేవతి ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఏకపాత్రాభినయం అంశంలో కొవ్వూరుపాడు అల్లూరి బాపినీడు హై స్కూల్ విద్యార్థిని కనుమూరి లీల సంతోషిని ప్రథమ స్థానంలో నిలిచిందని ఇన్‌ఛార్జి హెచ్ఎం డి.శేషారత్నం తెలిపారు. మేడం క్యూరీ పరిశోధనల గురించి ఆమె ఏకపాత్రాభినయం చేసిందన్నారు. రూ.2,500 ప్రైజ్ మనీ, విద్యార్థినికి ఉపయోగపడే పుస్తకాలు, సైన్స్ కిట్లు, సర్టిఫికెట్లు అందుకుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పిఎంసి ఛైర్మన్, సభ్యులు లీలను అభినందించారు.

యానాం వార్తలు

మురళీమోహన్‌కు నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

కార్మిక నాయకుడు మురళీమోహన్‌కు నివాళి

ప్రజాశక్తి - యానాం

యానాం రీజెన్సీ సెరామిక్స్ ఫ్యాక్టరీ కార్మిక ఉద్యమ నాయకుడు మచ్చ మురళీమోహన్ 12వ వర్ధంతిని కార్మికులు శనివారం నిర్వహించారు. రీజెన్సీ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద మురళీమోహన్ సతీమణి దుర్గ చేతుల మీదుగా ఎర్ర జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రీజెన్సీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ విల్సన్, జాయింట్ సెక్రెటరీ అడబాల సాంబశివరావు, గుదే దుర్గాప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రీజెన్సీని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. మురళీమోహన్ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మురళి,రామేశ్వరరావు ,వర్మ, శ్రీను ,నాగేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, సుబ్బారావు, సత్యనారాయణ పెద్ద ఎత్తున వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు రీజెన్సీ ప్రతినిధుల నివాళి

ప్రజాశక్తి - యానాం

రీజెన్సీ సెరామిక్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ దివంగత కెసి.చంద్రశేఖర్‌కు రీజెన్సీ గ్రూప్ సంస్థల ప్రతినిధులు నివాలులర్పించారు. రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో చంద్రశేఖర్ 12వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర్ చిత్రపటానికి రీజెన్సీ సిరామిక్స్ సిఇఒ కె.మోహన్‌రావు, పూర్వపు రీజెన్సీ ఉద్యోగి కాకరపర్తి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రీజెన్సీ సంస్థకు, రీజెన్సీ విద్యాసంస్థలకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. పాఠశాల హెచ్ఎం టివిఎస్ఎస్వి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆయన ఎందరికో ఆదర్శనీయమని, దానధర్మాలు చేసేవాడని తెలిపారు. అనంతరం యానాం వృద్ధాశ్రమంలో ఉన్న చంద్రశేఖర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్, చింతా కొండలరావు, సిహెచ్ వీరభద్రరావు, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు నివాలులర్పిస్తున్న ప్రతినిధులు, విద్యార్థులు

ప్రజలు నేరుగా సంప్రదించొచ్చు : మంత్రి వనిత

ప్రజాశక్తి-నల్లజర్ల

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

ప్రజలకు, తను మధ్య ఎలాంటి మధ్యవర్తులు అవసరం లేదని... నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా తనతో నేరుగా మాట్లాడొచ్చని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. శనివారం నల్లజర్లలో ప్రియాంక కన్వెన్షన్‌లో నిర్వహించిన వైసిపి మండల విస్తత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైసిపి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపి కంచుకోటగా ఉన్న నియోజక వర్గాన్ని 2019లోనే వైసిపి బద్దలు కొట్టిందన్నారు. 2024లో మరింత మెజారిటీతో గెలుస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అందరూ జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో 175కి 175 స్థానాలను వైసిపి కైవశం చేసుకుంటుందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సిద్ధం అనే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. ఫిబ్రవరి 1న ఏలూరులో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

నేడు టిడిపి మండల కమిటీ సమావేశం

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో, టిడిపి మండల సమావేశం, రా.. కదలిరా సన్నాహక సమావేశం, అనంతరం జయహో బిసి సదస్సు ఉంటుందని టిడిపి మండలం అధ్యక్షులు తాతిన సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మద్దిపాటి వెంకటరాజు హాజరవుతారన్నారు. వీటిని జయప్రదం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రెండు దశాబ్దాల సమస్యకు చెక్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గత రెండు దశాబ్దాల కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ చర్యలు తీసుకున్నారని వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. శనివారం 36వ వార్డు 3వ వీధి చీకట్ల కృష్ణాకర్ వీధిలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36వ డివిజన్ 3వ వీధి పల్లపు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతుందన్నారు. రోజుల తరబడి నీరు నిలిచిపోయి దుర్గంధం వస్తుందన్నారు. దోమలు వ్యాపించడంతో రోగాలు బారిన పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎంపీ భరత్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన స్వయంగా పరిశీలించి డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. రూ.20 లక్షలతో డ్రెయినేజీని నిర్మించనున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసి ఎఇ పిల్లి ప్రసాద్, వైసిపి నాయకులు నందం స్వామి, శీరపు పండు, జి.పార్వతి, కె.రాము, చరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి వీరన్నకి సన్మానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

సత్కరిస్తున్న పంచాయతీ, సచివాలయం సిబ్బంది

రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న మండలంలోని అన్నదేవరపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.వీరన్నను సచివాలయం సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు, సహకార బ్యాంకు అధ్యక్షులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు నాయకులు పిట్టా శ్రీను, న్యాయవాది నంద నూతంగి సురేష్ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ శేఖర్‌కు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శేఖర్‌ను సత్కరిస్తున్న ముఖ్యఅతిథులు

హాస్యానందం హాస్య పత్రిక, శ్రీమతి గుళ్లపల్లి అరుణకుమారి స్మారక రాష్ట్ర స్థాయి కార్టూన్ల పోటీల బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం జరిగింది. నగరానికి చెం,ఇన సీనియర్ కార్టూనిస్టు శేఖర్‌కు ఈ సందర్భంగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందించారు.ఆయన్ని ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథులుగా కప్పగంతు రామకృష్ణ, పి.రాము, పద్మదాస, బాచి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **శ్రీ రాయుడు వెంకటరమణ తండ్రి:రాయుడు శ్రీరాములు** గార్కి బి.దొడ్డవరం గ్రామంలో గల **డాక్యుమెంట్ నెంబర్ 76/2024** దానపట్టా దస్తావేజు పొందియున్నారు. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నందు ఋణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్థికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజినల్స్ రిజిస్టర్ దస్తావేజు నెంబర్ **76/2024 (తేది.09-01-2024)** ఈ రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్‌కు లింకు డాక్యుమెంట్‌గా ఉన్న **1030/1998 (తేదీ.12-11-1998)**ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం బి.దొడ్డవరం ఇంటి దగ్గర నుండి అమలాపురం వచ్చే దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా దానపట్టా దస్తావేజు **76/2024 (తేది: 09-01-2024)** దీనికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ దానపట్టా దస్తావేజు **1030/1998** యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్ సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపోజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు ఎవరైన వీటిని వినియోగించిన ఎడల చట్ట విరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎన్.రమేష్, అడ్వకేట్ & నోటరీ
అమలాపురం. సెల్: 8008027999

వేలం ప్రకటన
మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 104/2013, O.S. 150/2010

Between:
Peddireddy Ramam ...D.H.R
AND
Illa Satyavathi and Othrs ...J.D.R's

యీ నెంబరు E.P.లో DHR, JDRsకి చెందిన షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలమునకు తీసుకొని వచ్చుచున్నాడు. సదరు వేలంలో పాల్గోని పాట పాడుకోదలచినవారు **ది.06-02-2024 ఉదయం 10:30 గంIIలకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి పై వేలంలో పాల్గొని షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంలో పాట పాడుకోవచ్చును. మిగతా వివరాలు కోసం శ్రీ కోర్టు వారి నజారత్ ఆఫీసు నందు అడిగి తెలుసుకొనవలెను.

వేలం తేది: 06-02-2024

SCHEDULE

East Godavari District, Amalapuram Sub-Registry, Amalapuram Mandal, Peruru Village, Chindadagaruvu Panchayat Zeroyiti Wet.

Item No-1: R.S. No. 526/1, Ac. 2-30 cents out of full Ac. 2-66 cents

Boundaries: EAST: Irrigation bodi. ***SOUTH:*** Land of Pappula Udaya Bhaskaram. ***WEST:*** Land of Kode Naga Sundaram and others. ***NORTH:*** Land of Mushini Krishna Rao.

***Item No-2:* R.S. No. 526/1 Ac. 0-36 cents of Coconut garden out of full Ac. 2-66 cents.**

Boundaries: EAST: Item No. 1. ***SOUTH:*** Land of Pappula Udaya Bhaskara Rao. ***WEST:*** Drainage Canal. ***NORTH:*** Land of Mushini Krishna Rao.

Item No-3: R.S. No. 526/4 Ac. 0.34 cents out of full Ac. 0-90 cents.

Boundaries: EAST: Irrigation Bodi. ***SOUTH:*** Item No. 1. ***WEST:*** Land of Nagabheri People. ***NORTH:*** Land belongs. to Konde Naga Sundaram and Others. Total Ac. 3-00 of land with all fruit bearing trees and all other easementary rights etc.,

D.H.R. Value: Rs. 4,00,000/-
J.D.R. Value: NIL
Amin Value: Rs. 1,20,00,000/-
SRO Market Value:
Wet land Rs. 26,00,000/- per Ac.
Dry land Rs. 23,00,000/- per Ac.

G.S.NAIDU, Advocate
Amalapuram, Amalapuram
25-01-2024. Cell: 94409 25462